క్లుప్తంగా

ప్రకృతి సమతుల్యతను కాపాడుకుందాం



జగనన్న కాలనీలో మొక్కలు నాటుతున్న నాయకులు

నిడదవోలు : పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి ప్రకృతి సమతుల్యతను కాపాడుకుందాం అనే నినాదంతో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రపంచ మానవత దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో వైఎస్సార్ కాలనీ, జగనన్న కాలనీల్లో మంగళవారం మొక్కలు నాటారు. వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి ఓజోన్ పొరకు ముప్పు ఏర్పడుతుందని, బాధ్యత కలిగిన యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా మొక్కలు నాటాలని, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గారపాటి ప్రసన్నకృష్ణ, ఎండీ షాను, భుసవరపు సత్యనారాయణ, సుభాని, పోలిమాటి మొూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష తులసి దళాలతో శ్రీలక్ష్మీ నారాయణస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో మునిపల్లిలో శ్రీలక్ష్మీనారాయణస్వామి

నిడదవోలు రూరల్: శ్రావణమాసం బహుళ ఏకాదశి పురస్కరించుకుని మండలంలోని మునిపల్లిలో శ్రీ లక్ష్మీనారాయణస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామకృష్ణాచార్యులు పర్యవేక్షణలో లక్ష తులసి దళాలతో భక్తులు స్వామివారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాడపల్లి శశికాంత్, రాధాకృష్ణాచార్యులు, కల్యాణ్‌ప్రదీప్, భక్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో తనిఖీ

తాళ్లపూడి : ప్రక్కిలంక పైడిమెట్ట జంక్షన్ వద్ద గల ప్రైవేటు హాస్పిటల్‌ను డీఎంఅండ్ హెచ్‌ఓ కె.వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లో సదుపాయాలు, సేవలపై డీఎంహెచ్‌ఓ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చరణ్, భవ్య, బి.కృపావరం, హాస్పిటల్ యాజమాన్యం పెన్నాడ నరసింహమూర్తి పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

పెరవలి: పింఛన్ కోల్పోయిన దివ్యాంగులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇందుకోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని అందుతో గతంలో పింఛన్ పొందిన సర్టిఫికెట్, దివ్యాంగుల పాత సదరం సర్టిఫికెట్, కొత్త సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జత చేయాలని ఎంపీడీఓ ఘంటా శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తు చేసిన వారికి మరలా నోటీసు వస్తుందని ఆ సమయంలో వారు అందుబాటులో ఉండాలని తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

తాళ్లపూడి: ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తాళ్లపూడి, అన్నదేవరపేట పీహెచ్‌సీల పరిధిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను మంగళవారం డీఎంఅండ్ హెచ్‌వో పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హారికా గుప్త, సిబ్బంది ఉన్నారు.



లంకమాలపల్లి వద్ద ఏటుగట్టుపై గేదెలను కదుతున్న రైతులు



కానూరులో చెరువులను తలపిస్తున్న వరిచేలు



ముక్కామలలో మునిగిన కంద తోట



ఖండవల్లిలో ముంపు నీటిలో చిక్కుడు పాదులు

వరద ముంపులో లంక భూములు

- ఉధృతంగా వశిష్ఠ గోదావరి
- పశువుల పాకలు, పచ్చిక బయళ్ల మునక
- పాడి పశువుల దాణాకు కరవు
- 800 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం
- ఆందోళనలో లంక రైతులు



ఉసులుమర్రు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

పెరవలి: వశిష్ఠ గోదావరికి వరద పోటెత్తటంతో దిగువ లంకలో పంటలన్నీ నీటమునగడంతో పాటు పశువులకు గూడు కరువైంది. పెరవలి మండలంలో కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ముక్కామల, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరంలో దిగువ లంకల్లో 800 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఈ లంకల్లో కొబ్బరితోటలు, అరటి, కంద, కోకో, తమలపాకుల తోటలు, కూరగాయలు, ఆకుకూరలు తోటలు మునిగిపోతున్నాయి. చిక్కుడు, దొండ పందిర్లు, పచ్చిమిరప పంటలతో పాటు పూలతోటలైన బంతి, చామంతి, గులాబీ, మల్లె, లిల్లీ తోటలు ఒక్కొక్కటీ మునుగుతుండటంతో లంక రైతులు గగ్గోలు పెడుతున్నారు. వశిష్ఠ గోదావరి పరవళ్లు తొక్కుతూ రెండు రోజులుగా వరద పెరుగుతూ ఉండటంతో లంకల్లో వ్యవసాయ ఉత్పత్తులను తెచ్చుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన కంద పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాడి రైతులకు ఇక్కట్లు

లంకల్లో ఉండే పశువుల పాకలతో పాటు పచ్చిక బయళ్లు మునిగిపోవడంతో రైతులు వాటిని గట్లపైనే ఉంచారు. గోదావరి వరద ఉధృతి మరింత తీవ్ర రూపం దాలిస్తే సమస్యలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఇదే జూలైలో రెండు సార్లు గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో లంక భూముల్లో పంటలు పూర్తిగా పాడైపోయాయి. ఈ ఏడాది ముందస్తుగా జాగ్రత్తలు తీసుకున్నా పంటలను రక్షించుకునే పరిస్థితి లేకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటలకు తీవ్ర నష్టం.. రైతుల గగ్గోలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వివిధ పంటలు నీట మునిగిపోయాయి. పెరవలి మండలంలో వ్యవసాయాధికారులు అంచనాలు ప్రకారం వరిచేలు 188 ఎకరాలు, ఉద్యాన పంటలు, కూరగాయల పంటలు 40 ఎకరాల్లో నీట మునిగాయని ప్రాథమిక అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించారు. నీటమునిగి ఉన్న పంట పొలాలు నీరు పూర్తిగా లాగిన తరువాత పూర్తి అంచనాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, నడుపల్లి గ్రామాల్లో ఎక్కువగా వరిచేలు మునిగాయి. పెరవలి మండలంలో మురుగు నీరు లాగే నక్కల కాలువ పూడుకుపోవడంతో ఎక్కడి నీరు అక్కడే ఉందని రైతులు చెబుతున్నారు. ముంపు నీరు మరో రెండు రోజులు పొలాల్లో ఉంటే వరినాట్లు కుళ్లిపోతాయని, కూరగాయల పంటలు దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరవలి మండలంలో కానూరు బాడవా, కానూరు అగ్రహారం, ఉసులమర్రు, ముక్కామల గ్రామాల్లో 250 ఎకరాలు వరిచేలు పూర్తిగా నీటమునిగాయి. ఖండవల్లి, అన్నవరప్పాడు, ముక్కామల, తీపర్రు,కాకరపర్రు, మల్లేశ్వరంలో 40 ఎకరాల్లో ఉద్యాన, కూరగాయ, వరి చేలు ముంపుబారిన పడ్డాయని రైతులు చెబుతున్నారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులు వర్షాలు ఇలాగే ఉంటాయని చెప్పడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు.



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్



కాకరపర్రులో వరద నీటిలో అరటితోట

పెరుగుతున్న గోదావరి వరద

తాళ్లపూడి(కొవ్వూరు): గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. మంగళవారం గోదావరిలో వరద పెరగడంతో అధికారులు రేవులను పరిశీలించారు. కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద కొవ్వూరు తహసీల్దార్ దుర్గాప్రసాద్ పరిశీలించి అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. నదిలోకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు గస్తీ నిర్వహించారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం వద్ద, ప్రక్కిలంక ర్యాంపు వద్ద నది ప్రవాహం ఉధృతంగా ఉంది. గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. వరద కారణంగా చేపల వేటకు వెళ్లే పడవలు ఒడ్డుకు చేరాయి.

పోటెత్తిన కొవ్వాడ కాలువ



పోచవరం వద్ద కొవ్వాడ కాలువ వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీలావణ్య

తాళ్లపూడి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. మండలంలోని పోచవరం వద్ద మంగళవారం వరద ఉధృతి పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి అధికంగా వర్షంనీరు వచ్చి చేరుతుండడంతో మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. పోచవరం నుంచి తాడిపూడి, గూటాల వైపు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహించడంతో అటువైపు రాకపోకలు స్తంభించాయి.

తహసీల్దార్ పరిశీలన : పోచవరం వద్ద తహసీల్దార్ లక్ష్మీలావణ్య, రెవెన్యూ సిబ్బందితో కలసి కొవ్వాడ కాలువను పరిశీలించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున రాకపోకలు సాగించరాదని తెలిపారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసారు. ఆమె వెంట వీఆర్వోలు లీలావతి తదితరులున్నారు.

రాగోలపల్లి సొసైటీలో అవకతవకలపై విచారణ

- సొసైటీ కార్యదర్శి కె.భాస్కర్ తొలగింపు



రాగోలపల్లి సొసైటీలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుబ్బారావు

తాళ్లపూడి: రాగోలపల్లి కోఆపరేటివ్ సొసైటీలో ఆర్థిక, పరిపాలనాపరమైన అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు రావడంతో అధికారులు 1964 సహకార సంఘ చట్టం సెక్షన్ 51 ప్రకారం విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సొసైటీ కార్యదర్శి కె.భాస్కర్‌ను ఉన్నతాధికారుల ఆదేశాలతో కొవ్వూరు డీసీవో విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు నూతన అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్ తెలిపారు. తాడిపూడి సొసైటీ కార్యదర్శికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించినట్టు చెప్పారు. సొసైటీలో అవకతవకలు జరిగాయని పలువురు రైతులు కలెక్టర్‌కు, ఆర్డీవోకు మీకోసంలో గతంలో ఫిర్యాదు చేశారు. అధికారులు కె.ఉషారాణి, ఎస్.బ్యూలారాణి ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతుందని ఆడిట్ నిర్వహిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.సుబ్బారావు తెలిపారు. ఆయన మంగళవారం విచారణ సమయంలో మాట్లాడుతూ సొసైటీలో రైతులు డిపాజిట్ చేసిన సొమ్ములో 70 శాతం నిధులను సహకార సంఘ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. బంగారు, వ్యక్తిగత రుణాల మంజూరు, ఎరువులు, విత్తనాలు క్రయ విక్రయాలు తదితర పనులు నిర్వహిస్తారని, ఈ క్రమంలో అవకతవకలు జరిగాయని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన త్రిసభ్య కమిటీ కోరవడంతో కార్యదర్శిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసి, ఇన్‌చార్జికి బాధ్యతలను అప్పగించామని, ఈ ఆదేశాలు డీసీవో వెంకటరాజు జారీ చేసినట్టు తెలిపారు. పూర్తిస్థాయి విచారణ పూర్తయిన తరువాత చర్యలు ఉంటాయని తెలిపారు.

నకిలీ బంగారం తాకట్టుపై రుణాలు

రాగోలపల్లి సొసైటీలో నకిలీ బంగారం తాకట్టుపెట్టుకుని రుణాల మంజూరు, సరైన సెక్యూరిటీ డాక్యుమెంట్లు లేకుండానే రుణాలు మంజూరు చేయడం, ఎరువులు, విత్తనాలు లెక్కల్లో నిర్లక్ష్యం, వ్యక్తిగత రుణాల మంజూరు తదితర అంశాలకు సంబంధించిన రికార్డుల్లో గణాంకాలలో వ్యత్యాసాలున్నాయని ఆరోపణలు వచ్చినట్టు సుబ్బారావు తెలిపారు. ఆడిట్ అధికారులు రికార్డులు తనిఖీ చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో భాస్కర్‌ను తొలగించడం చర్చనీయాంశమైంది. నిధుల దుర్వినియోగం వివరాలు అధికారుల విచారణ అనంతరం బయటకు వస్తాయి.

‘స్వామిత్వ’ సర్వే పునఃప్రారంభం

నల్లజర్ల: గ్రామీణ ప్రాంత నివాస గృహాలు, ఖాళీ స్థలాల గుర్తింపు ప్రక్రియ స్వామిత్వ కార్యక్రమం మండలంలో పునఃప్రారంభమైంది. మొదటి విడత చీపురుగూడెం, రెండవ విడత పడమర చోడవరం, మార్రెళ్లమూడిలో ఈ సర్వే నిర్వహించారు. తాజాగా ఆగస్టు 1న గ్రామ సభలు నిర్వహించి సర్వే ప్రారంభించినట్టు ఎంపీడీఓ సింహాద్రిరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ పథకం 2020న అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రారంభమైంది.గతంలో సర్వే పూర్తయిన గ్రామాల్లో ఇంటి యజమానులకు ఆస్తి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. మిగిలిన 9 రెవెన్యూ గ్రామాల్లో సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సచివాలయ సిబ్బంది, వీఆర్వో, మహిళా సంరక్షణ కార్యదర్శి టీమ్‌గా ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి ఈ కార్యక్రమం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. సర్వే ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలపై ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. వారి సమస్యల పరిష్కారం అనంతరం వారి ఆస్తులకు చట్టబద్ధత కలిగిన ధ్రువపత్రం అందజేస్తామన్నారు. సర్వే కోసం గ్రామాల్లో ఇళ్లకు వచ్చే సర్వే బృందాలకు క్షేత్రస్థాయిలో సమగ్ర సమాచారం అందించి ప్రజలు సహకరించాలని కోరారు. మంగళవారం అనంతపల్లిలో ఈ సర్వేను ఎంపీడీఓ పర్యవేక్షించారు. ఈసర్వేలో గ్రామ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ కార్యదర్శి ఉదయకుమార్, కనకదుర్గ, సర్వేయర్ ఈశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



తెలికిచెర్లలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సింహాద్రిరావు

పోలీసుల తీరుపై రైతుల ఆగ్రహం



నల్లజర్ల పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

నల్లజర్ల: పొలాల్లో మోటార్ల తీగల చోరీకి పాల్పడుతున్న దొంగలను పట్టిచ్చినా చర్యలు తీసుకోవడంపై తాత్సారం చేస్తున్న పోలీసుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళితే మంగళవారం చీకటి పడుతుండగా తాడేపల్లిగూడెం రహదారిలో నల్లవంతెన సమీపంలోని కండెపు సుబ్బారావు పొలంలో కొందరు మోటారు తీగలు కత్తిరిస్తుండగా రైతులు మాటు వేసి ముగ్గురిని వెంబడించారు. వారిలో ఇద్దరు పారిపోగా ఒకరిని పట్టుకున్నారు.ఈ ముగ్గురూ దువ్వ, పూళ్లకు చెందిన వారని రైతులు చెబుతున్నారు. దొరికిన దొంగను నల్లజర్ల పోలీసులకు అప్పగించారు.గంటల సమయం గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. రెండురోజుల కిందట పుల్లలపాడు వద్ద ఇదే విధంగా ఇద్దరు దొంగలను పట్టుకొని అప్పగిస్తే వారిపై కూడా పోలీసులు ఎటువంటి చర్య తీసుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. పంట సాగు సమయంలో మోటార్ల తీగలు కత్తిరించి చోరీకి పాల్పడితే పొలాలకు నీరందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు అన్నారు. దొంగలను పట్టుకుని అప్పగిస్తే సాధారణ విషయంగా పోలీసులు పరిగణిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎస్సై సత్యనారాయణను వివరణ కోరగా ఎవరినీ విడిచి పెట్టే ప్రసక్తి లేదని, పారిపోయిన వారికోసం ప్రత్యేక బృందాన్ని పంపినట్టు చెప్పారు.

ఇన్ సర్వీసు కోటా తగ్గింపుతో అన్యాయం

రాజమహేంద్రవరం రూరల్: జీవోఎంఎస్ నం.99 ద్వారా పీహెచ్‌సీ వైద్యులకు ఇన్ సర్వీస్ పీజీ కోటా తగ్గించడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక అన్నారు. మంగళవారం కలెక్టర్‌తో పాటు, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావుకు సంఘ ప్రతినిధులతో కలిసి ఆమె వినతిపత్రాలు అందజేశారు. నూతన జీవోను రద్దు చేసి, ఇన్ సర్వీస్ పీజీ కోటా యథాతథంగా ఉంచాలని డాక్టర్ మౌనిక డిమాండ్ చేశారు.

డ్రగ్స్ వ్యాపారుల అక్రమాస్తుల స్వాధీనం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మత్తు పదార్థాల వ్యాపారం నుంచి ఆదాయం పొందే వారిపై కఠిన ఆర్థిక విచారణ చేపట్టి, అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని ఏపీ ఈగల్ చీఫ్, ఐజీపీ ఆకే రవికృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును మంగళవారం ఆయన సందర్శించారు. జైలులోని వివిధ విభాగాలను పరిశీలించారు. గంజాయి, నిషేధిత డ్రగ్స్‌పై ఇక నేరాలు చేయబోమని ఖైదీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ, ఎన్‌డీపీఎస్ చట్టం–1985 ప్రకారం డ్రగ్స్ అక్రమ రవాణా, నిల్వ, విక్రయం మాత్రమే కాకుండా, వాటి ద్వారా పొందిన అక్రమ ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తారని వివరించారు. ఈ క్రమంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వ్యాపారంలో నిమగ్నమైన వ్యక్తులు, వారి సంబంధీకుల బ్యాంక్ ఖాతాలు, స్థిరాస్తులు, వాహనాలు, ఇతర ఆర్థిక వనరులపై దర్యాప్తు చేసి, అక్రమ సొమ్మును గుర్తించి, సంబంధిత ఆస్తులను సీజ్ చేస్తామని వివరించారు. డ్రగ్స్ మాఫియాను మూలాలు సహా నిర్మూలించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఎన్‌సీబీ, ఎక్సైజ్, ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేస్తున్నామన్నారు. ఈ చట్టం ప్రకారం మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలపై నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొనే వారిని ఏడాది పాటు నిర్బంధించే అధికారం పోలీసు విభాగానికి ఉందన్నారు. ఈగల్ ఎస్పీ కె.నగేష్‌బాబు, జైలు సూపరింటెండెంట్ రాహుల్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ పీవీ సూర్య మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ డాగురేకు ఘన నివాళి



లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు : స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఫొటోగ్రఫీ పితామహులలో ఒకరైన లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్, దారపురెడ్డి ప్రతాప్, నిప్పులేటి వెంకటరమణ, ముత్తా వెంకటేశ్వరరావు, కట్టా సుధాకర్, జనపరెడ్డి లక్ష్మణరావు, యేనుముల శ్రీనివాస రంగారావు, మద్దుల కోటేశ్వరరావు, గుంటిపల్లి సత్యసాయి, గోపిరెడ్డి శ్రీనివాస్, నీలం నాగేంద్రప్రసాద్, పోలదాసు శ్రీనివాసరావు పొన్నా సుబ్రహ్మణ్యం, కేదారిశెట్టి రవికుమార్, ఎండీ ఫయాజ్, సానేపు సుబ్బారావు, యాసరపు రామకృష్ణ, పాడుగు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో లూయిస్ డాగురేకు నివాళులర్పిస్తున్న ఫొటో గ్రాఫర్లు

నూతన కార్యవర్గం ఎంపిక

నిడదవోలు : ఫొటోగ్రఫీ పితామహుల్లో ఒకరైన లూయిస్ డాగురే కృషి మరువలేమని నిడదవోలు ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు అసోషియేషన్ అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం అన్నారు. పట్టణంలో షాదీఖానా వద్ద మంగళవారం ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిడదవోలు ప్రొఫెషల్ ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. నిడదవోలు ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు అసోసియేషన్ అధ్యక్షుడిగా సయ్యద్ ఇబ్రహీం, గౌరవాధ్యక్షుడు లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు కె.గౌరిశంకర్, కార్యదర్శిగా కె. చైతన్యకృష్ణ, కోశాధికారి షేక్ రహీం, సంయుక్త కార్యదర్శి పి. సాయిశంకర్‌ను ఎన్నుకున్నారు.

ఆరుతడితో నాణ్యమైన పంట దిగుబడి

చాగల్లు: కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు మాట్లాడుతూ ఆరుతడి వ్యవసాయంలో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని నీటిని తక్కువగా అందించడం వలన పంటకు ఎటువంటి తెగుళ్లు సోకవని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ప్రయోజనాలను వివరించారు. ఆరుతడి పంట వల్ల నీరు, విద్యుత్ ఆదాతో పాటు 50శాతం మీథేన్ వాయువును తగ్గించవచ్చన్నారు. జిల్లా జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి మాట్లాడుతూ ఆరుతడి వ్యవసాయం అనేది రైతులకు మంచిదని, డెల్టా ప్రాంతంలో నీటిని ఎక్కువగా వినియోగించడంతో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని, సక్రమంగా నీటి తడులు ఇవ్వటం వలన నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, ఐసీఆర్‌పీలు వెంకటేశ్వరరావు, వెంకట్రావు, మమత, పార్వతి, శాంతి, వీరమణి, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

నల్లజర్ల: వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగం తగ్గించాలని ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది. మంగళవారం పుల్లలపాడు రైతు సేవాకేంద్రం వద్ద పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.సోమశేఖరం, ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్లు పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు అందించారు. యస్.యఫ్.ఏ విభాగం అధికారి సతీష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు సూచనలిచ్చారు. ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది కోటేశ్వరి, ప్రసాద్, వీహెచ్ఏ రూప, రైతులు పాల్గొన్నారు.



పుల్లలపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

యూరియా అధికంగా వాడొద్దు

నిడదవోలు రూరల్: ఖరీఫ్ సాగులో యూరియా అధికంగా వాడొద్దని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని సింగవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా 500 మిల్లీ లీటర్లు ఎకరానికి వేస్తే నత్రజని వృథా కాకుండా మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

మల్లవరంలో..

చాగల్లు : మల్లవరంలో వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు వరి పంటలో ఆరుతడి సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాల అదనపు ప్రాజెక్టు మేనేజర్ వలి, జూనియర్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి, ఐసీఆర్‌పీ శ్రీనివాస్, పొలవేణి, రత్నకుమారి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



దూబచర్ల సబ్ సెంటర్ పరిధిలో విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

నల్లజర్ల: పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని దూబచర్ల సబ్ సెంటర్ ఎంయల్‌హెచ్‌పీ షేక్ జరీనా అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా పిల్లల ఆరోగ్య పరిరక్షణ, వాక్సినేషన్ ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్గిస్తున్నట్టు చెప్పారు.

రక్తహీనతపై ప్రత్యేక దృష్టి : ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న విద్యార్థుల ఆరోగ్య వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్టు ఏఎన్‌ఎం సుబ్బలక్ష్మి చెప్పారు. స్క్రీనింగ్‌లో విద్యార్థుల ఎత్తు, బరువు, బాడీమాస్ ఇండెక్స్ వివరాలు సేకరించడంతో పాటు రక్తహీనతను గుర్తించేందుకు హీమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నట్టు చెప్పారు.రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి వారానికి ఒకసారి ఐరన్, ఫోలిక్ మాత్రలు అందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యంతో పాటు పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలిస్తున్నట్టు చెప్పారు.